సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



5,767 ఎకరాల్లో పంట నష్టం

ఇటీవలి భారీ వర్షాలతో జిల్లాలో 5,767 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ సర్వేలో తేలింది.

8లో



తగ్గుతున్న తాలిపేరు

చర్ల మండలంలోని తాలిపేరుకు రెండు రోజుల పాటు వరద పోటెత్తగా మంగళవారం తగ్గుముఖం పట్టింది.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

31° / 24°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని చోట్ల జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆత్మగౌరవం కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనియాడారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం బీసీ సంక్షేమాధికారి ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐలమ్మ తెలంగాణ ముద్దుబిడ్డ అని, ఆమె జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ కె. చంద్రశేఖర్, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, డీఎస్‌ఓ రుక్మిణి, కలెక్టరేట్ ఏఓ గన్యా, బీసీ సంఘాల నాయకులు ఇంద్రాల దుర్గయ్య, చిటికెన ముసలయ్య, అజిత్‌కుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, ఎం. కోటేశ్వరరావు, ఎన్. మధు, రాంబాయి, పి.శాంత, కొదుమూరి సత్యనారాయణ, కురిమెళ్ల శంకర్ పాల్గొన్నారు.

‘రేషన్’లో అక్రమాలకు పాల్పడొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా చేసే బియ్యం, పంచదార, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు పంపిణీ చేసే సన్నబియ్యంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడొద్దని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన కమిటీ సభ్యులతో చర్చించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. సరుకుల పంపిణీలో అవకతవకలు జరగకుండా స్టాక్ రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. బియ్యం సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వివరాలతో పౌరసరఫరా శాఖ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ రుక్మిణి, పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొలంబియా టూర్‌కు సింగరేణి రెస్క్యూ టీమ్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 13 నుంచి 20 వరకు కొలంబియాలో జరిగే ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ కాంపిటీషన్ (ఐఎంఆర్‌సి)లో పాల్గొనేందుకు సింగరేణి డీజీఎం మాధవరావు ఆధ్వర్యంలో 11 మంది సభ్యులు మంగళవారం బయలుదేరారు. ఈ టీమ్‌కు చీఫ్ ఆఫీసర్‌గా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్ అండ్ పా) ఎన్‌వీకే. శ్రీనివాస్ కూడా వారితో కలిసి వెళ్లారు. సింగరేణిలో పనిచేసే పలువురు సిబ్బందికి 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వగా, ప్రతిభ చూపిన 11 మందిని ఎంపిక చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సింగరేణి టీమ్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో పాల్గొంటూ పలు అవార్డులు సాధించింది. పోటీలకు వెళ్లిన 11 మంది టీమ్‌లో రామగుండం, బెల్లంపల్లి రీజియన్ల నుంచి 10 మంది ఉండగా, కొత్తగూడెం రీజియన్ పరిధిలో మణుగూరు ఏరియా నుంచి ఒక కార్మికుడు ఉన్నట్లు తెలిసింది.

కష్టం.. నష్టం

ఈనెల ఒకటో తేదీ నుంచి దంచి కొడుతున్న వర్షాలతో జిల్లా వ్యాప్తంగా భారీ నష్టం వాటిల్లింది. వరద నీరు ముంచెత్తడంతో పంటలు మునిగిపోయాయి. రహదారులు, ఊళ్లు, ఇళ్లలోకి వరద నీరు పోటెత్తింది. దీంతో సాగు, రవాణా, విద్యుత్, ఇరిగేషన్ శాఖలకు భారీ నష్టం ఏర్పడింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



పెదవాగు ప్రాజెక్టు రింగ్ బండ్ వద్ద పడిన భారీ గండి (ఫైల్)

- నెలారంభం నుంచి కమ్ముకున్న ముసురు
- భారీ వర్షాలతో పొంగిన వాగులు, వంకలు
- జిల్లా వ్యాప్తంగా ఐదుగురు మృతి, ఇద్దరు గల్లంతు
- విద్యుత్, రవాణా, వ్యవసాయ శాఖలకు నష్టం

ఐదుగురి మృత్యువాత..

భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరదలతో జిల్లా వ్యాప్తంగా ఐదుగురు మృతిచెందారు. అశ్వాపురంలో వాగు ఒడ్డున ఉన్న ఇద్దరు మేకల కాపరులు వరదలో కొట్టుకుపోయి మృత్యువాత పడగా, మణుగూరులో ఒకరు చనిపోయారు. మేడారం వెళ్లి వస్తున్న మరో ఇద్దరు కిన్నెరసాని వాగులో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. ఇక పాల్వంచ మండలంలో కిన్నెరసాని డ్యామ్ గేట్లు ఎత్తడంతో ఒకరు, టేకులపల్లి మండలంలో మరొకరు వరదలో గల్లంతయ్యారు. వరద ప్రభావంతో చనిపోయిన ఐదుగురి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి సాయం అందింది.

నేలకూలిన స్తంభాలు..

వరదల కారణంగా విద్యుత్ శాఖకు రూ. 32 లక్షల మేర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 152 విద్యుత్ స్తంభాలు నేలకూలగా.. మూడు కండక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. మరోవైపు నీళ్లలో మునగడం ద్వారా 15 ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా, 10 ట్రాన్స్‌ఫార్మర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వరదలతో జాతీయ, ఆర్‌అండ్‌బీ రోడ్లకు పెద్దగా నష్టం వాటిల్లకున్నా.. పంచాయతీరాజ్ పరిధిలో 15 కి.మీ. మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. వీటి మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి రూ. 2 కోట్ల వరకు వ్యయం కానుంది.

రూ.3.5 కోట్లు నీళ్లపాలు..

మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో మొత్తం 32 చోట్ల డ్యామేజీలు జరగగా రూ.4 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇందులో ప్రధానంగా పెదవాగు ప్రాజెక్టుకు మరోసారి వరద రావడంతో ఇటీవల చేపట్టిన రింగ్‌బండ్ కొట్టుకుపోయింది. ఫలితంగా రూ.3.50 కోట్లు నీళ్లపాలయ్యాయి. గత జూలైలో కురిసిన వర్షాలతో ఈ ప్రాజెక్టుకు గండి పడి నీరంతా బయటకు వెళ్లిపోయింది. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లోనే ఈ ప్రాజెక్టు కింద ఉన్న సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో తాత్కాలికంగా రింగ్ బండ్ నిర్మాణ పనులు ఆగమేఘాల మీద చేపట్టారు. ఈ పనులు పూర్తికాక ముందే మరోసారి వరద ముంచెత్తడంతో పెదవాగు కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఇక భారీ నీటి పారుదల శాఖ పరిధిలో పాల్వంచ, చంద్రుగొండ మండలాల్లో సీతారామ ప్రధాన కాలువకు గండ్లు పడ్డాయి.

వీడని ముప్పు

వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఈనెల 12 వరకు జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడవచ్చని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఇంకా వాన, వరద గండం ముప్పు తొలగిపోలేదు. ఇక ఇంద్రావతి క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పెరుగుతోంది. దీంతో గోదావరి తీరం వెంట దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో పంట పొలాల్లోకి క్రమంగా వరద నీరు చేరుతోంది.

కష్టాల్లో సాగు..

ఆగస్టు 31 అర్ధరాత్రి కురిసిన వర్షానికి వాగులు ఉప్పొంగడంతో ఈనెల 1వ తేదీ నాటికే సుమారు మూడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. కానీ ఆ తర్వాత ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఈ నష్టం మరింతగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా వర్షాలు, వరదలు ఎక్కువగా ఉన్న ఐదు మండలాల్లో చేపట్టిన సర్వేలో ఇప్పటి వరకు 5,767ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు తేలింది. ఇందులో 1,650 ఎకరాల్లో ఇసుకమేటలు వేశాయి. వర్షాల కారణంగా పత్తి పంట సాగు చేస్తున్న రైతులు అధికంగా నష్టపోయారు. ఆ తర్వాత స్థానంలో వరి పండించే రైతులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగుతున్నందున ఈ నష్టం మరింతగా పెరిగే అవకాశం ఉంది.



రెడ్డిపాలెంలో మట్టి మేటలతో దెబ్బతిన్న పత్తిచేను (ఫైల్)

భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



ఒకే రోజు ‘రెండు’

- భద్రాచలం వద్ద మళ్లీ గోదావరి ఉధృతి
- మొదటి, రెండో ప్రమాద హెచ్చరికల జారీ
- ఎగువ నుంచి పోటెత్తుతున్న వరద
- గంటగంటకూ పెరుగుతున్న నీటిమట్టం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. ఈనెల 4న గోదావరి వరద ఉధృతి పెరగగా, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 5వ తేదీ రాత్రి 11 గంటలకు 45 అడుగుల వద్దకు చేరుకున్న నీటిమట్టం క్రమంగా తగ్గింది. అయితే రెండు, మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి నుంచి భారీగా వరద పోటెత్తింది. 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు 26.10 అడుగులు ఉన్న నీటిమట్టం మంగళవారం ఉదయం 5 గంటలకు 40 అడుగులకు చేరింది. 7:32 నిమిషాలకు 43 అడుగులు దాటడంతో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అప్పటి నుంచి నీటిమట్టం వేగంగా పెరుగుతూ 9 గంటలకు 44.20, 10 గంటలకు 44.90, మధ్యాహ్నం 12 గంటలకు 46, 2 గంటలకు 47, సాయంత్రం 5:15 గంటలకు 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక సైతం జారీ చేశారు. ఇక రాత్రి 12 గంటలకు 49.60 అడుగులకు చేరింది.

ఐదు రోజుల్లో రెండుసార్లు..

భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులు దాటితే మొదటి, 48 అడుగులకు రెండో, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఈ నెలలో ఐదు రోజుల వ్యవధిలోనే రెండుసార్లు 43 అడుగులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

మూడు రాష్ట్రాలకు నిలిచిన రాకపోకలు..

గోదావరి వరద పెరగడంతో పాటు ఏపీలోని వీఆర్‌పురం – కూనవరం మధ్యనున్న శబరి ఉప నది పోటెత్తడంతో పలుచోట్ల ప్రధాన రహదారుల పైకి నీరు చేరింది. దీంతో తెలంగాణ నుంచి ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

గోదావరి నీటి ప్రవాహం వేగంగా పెరుగుతుండడంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల వివరాలు తెలిపేందుకు భద్రాచలం ఐటీడీఏలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. ఏజెన్సీ గ్రామాలు ముంపునకు గురైనా, ఇతర సహాయ కార్యక్రమాలు అవసరమైనా 79952 68352 నంబర్‌కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో 08743 – 232444, 79812 19425 నంబర్లలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్

భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద వస్తోందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా పట్టణంలో బ్యాక్ వాటర్ వస్తే గోదావరిలోకి ఎత్తిపోసేందుకు మోటార్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు గోదావరికి వచ్చే భక్తులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కోరారు. గోదావరి వరద నీటిమట్టానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని వివిధ రూపాల్లో ప్రజలకు తెలుపుతూ అప్రమత్తం చేస్తున్నామని, ప్రతీ ఒక్కరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య, ఆర్‌ఐ నరసింహారావు పాల్గొన్నారు.

స్నానఘట్టాల వద్ద షవర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని గోదావరి స్నాన ఘట్టాల వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో షవర్లు ఏర్పాటు చేశారు. గోదావరికి భారీగా వరద వస్తుండడంతో రామాలయాన్ని దర్శించుకునే భక్తులతో పాటు గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవాలకు వచ్చే భక్తులు నదిలో స్నానాలు చేసే అవకాశం లేదు. దీనికి తోడు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని షవర్లు ఏర్పాటు చేయగా.. ఈఓ శ్రీనివాసరావు పరిశీలించారు.

గిరిజన యువత మార్గదర్శకంగా నిలవాలి

- ఐటీడీఏ పీఓ రాహుల్
- చిన్న తరహా పరిశ్రమల పరిశీలన



యూనిట్ల పరిశీలనకు కాలినడకన వెళ్తున్న పీఓ రాహుల్

దుమ్ముగూడెం: నిరుద్యోగులైన గిరిజన యువత, రైతులు ప్రభుత్వ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించడమే కాక పలువురికి ఉపాధి కల్పించి మార్గదర్శకంగా నిలవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన ఎంఎస్‌ఎంఈ యూనిట్ ద్వారా స్థాపించిన చిన్న తరహా పరిశ్రమలను పరిశీలించారు. సమ్మక్క– సారక్క చిల్లీ యూనిట్, దుర్గాభవాని సెంట్రింగ్ యూనిట్, శ్రీ సీతారామ కాంక్రీట్ మిషన్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. యూనిట్ల యజమానులు పక్కా ప్రణాళికతో పరిశ్రమలు నడిపించాలని, సమీపంలోనే ఛత్తీస్‌గఢ్ ఉన్నందున మార్కెటింగ్‌కు ఢోకా ఉండదని తెలిపారు. ఆ తర్వాత ఆర్లగూడెంలో డ్రాగన్ ఫ్రూట్ తోటను బైక్‌పై వెళ్లి పరిశీలించారు. అనంతరం చిన్న నల్లబల్లిలోని అంగన్‌వాడీ సెంటర్, జీపీఎస్‌ను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఏపీఎం హేమంత్, జేడీఎం హరికృష్ణ, డీఈ హరీష్, ఏఈలు వెంకటేశ్వర్లు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై మమకారం పెరగాలి



ఏకపాత్రాభినయం చేస్తున్న విద్యార్థిని

భద్రాచలం: తియ్యదనం, కమ్మదనం కలిగి కన్నతల్లి లాంటిదైన తెలుగు భాషపై విద్యార్థులు మమకారం పెంచుకోవాలని పీఓ రాహుల్ సూచించారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కవితలు, శీర్షికలు, పద్యాలు, తెలుగులో మాట్లాడటం, ఏకపాత్రాభినయం, క్విజ్ పోటీలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసిన పీఓ మాట్లాడుతూ పిల్లలు తెలుగులో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆ తర్వాత పీఓ తాను రాసిన కవిత వినిపించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఆర్‌సీఓ నాగార్జునరావు, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బంగారం, వెండి జియో ట్యాగింగ్

రామాలయ ఈఓ రమాదేవి వెల్లడి



మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని బంగారం, వెండికి త్వరలో జియో ట్యాగింగ్ విధానం అమల్లోకి తీసుకొస్తున్నట్టు ఈఓ ఎల్.రమాదేవి వెల్లడించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఆలయంలో బంగారం, వెండి ఆభరణాలపై ఆడిట్ నడుస్తోందని, బంగారం లెక్కల్లో తేడా ఉన్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని స్పష్టం చేశారు. అయితే, వెండి అసలు లెక్కలో కొద్దిగా తేడా వచ్చిందని, పర్ణశాలలో ఆడిట్ పూర్తయితే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అలాగే, ఆలయంలోని అన్ని వ్యవస్థల్లో పారదర్శకత తీసుకొచ్చేలా ఇప్పటికే కంప్యూటరీకరించామని, త్వరలోనే అన్ని విభాగాలను ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించినా, ఆడిట్ లెక్కల్లో తేడా వచ్చినా ఉపేక్షించేది లేదని చెప్పారు. రెండు రోజుల క్రితం టికెట్ కౌంటర్‌లో పనిచేసే ఉద్యోగి రూ.3 లక్షలకు పైగా నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలడంతో సస్పెండ్ చేశామని చెప్పారు. ఇక వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా లడ్డూలు తయారుచేయించి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు.

అంతర్గత బదిలీల్లో మార్పులు..

ఇటీవల చేపట్టిన అంతర్గత బదిలీల్లో కొద్దిమేర మార్పులు జరిగాయని ఈఓ రమాదేవి వెల్లడించారు. లడ్డూల జారీ కౌంటర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావును క్యాషియర్‌గా, కౌంటర్ రిలీవర్ కె.సతీష్‌ను లడ్డూల జారీ కౌంటర్ ఇన్‌చార్జ్‌గా, కార్యాలయం నుంచి ఎం.నర్సింహారావును ప్రసాదాల జారీ కౌంటర్ రిలీవర్‌గా మార్చినట్లు తెలిపారు. అలాగే, ప్రొవిజన్ స్టోర్ అకౌంటెంట్ రాకేష్ బాధ్యతలను కె.వెంకటేశ్వరరావుకు అప్పగించామని వివరించారు.

హైడ్రా ప్రత్యేక సెల్‌కు ఆర్ఐ నాగేశ్వరరావు



నాగేశ్వరరావు

ఖమ్మంక్రైం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న హైడ్రా ప్రత్యేక సెల్‌లో ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో పనిచేస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)కు స్థానం దక్కింది. ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.నాగేశ్వరరావును హైడ్రా ప్రత్యేక సెల్‌కు ఎంపిక చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 23 మంది పోలీస్ అధికారులకు స్థానం కల్పించగా.. అందులో నాగేశ్వరరావు కూడా ఉన్నారు.

‘పేట’లో ఇసుక దందా!

- అశ్వారావుపేట కేంద్రంగా అంతర్రాష్ట్ర మాఫియా
- ఇక్కడ డంపింగ్.. హైదరాబాద్‌కు తరలింపు
- ఏపీ రీచ్‌ల నుంచి అక్రమ రవాణా



అశ్వారావుపేటలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

అశ్వారావుపేట: ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో గల పలు ఇసుక ర్యాంపులు అక్రమ వ్యాపారులకు బంగారు గనులుగా మారాయి. ఏలూరు జిల్లాకు తరలించేందుకు ఇసుకను బుక్ చేసుకునే వ్యాపారులు అశ్వారావుపేటలో అన్‌లోడ్ చేస్తున్నారు. ఇక్కడ ముగ్గురు వ్యాపారులు ఏపీ ఇసుకను అక్రమ మార్గంలో తరలించి వ్యాపారం చేస్తున్నారు. గతంలో ఇదే తరహా ఇసుకను అధికారులు సీజ్ చేసినా.. ప్రస్తుతం వారి వ్యాపారం మూడు లారీలు.. ఆరు ట్రిప్పులుగా సాగుతోంది. దీనికి తోడు అశ్వారావుపేట మండలం వాగొడ్డుగూడెం, అనంతారం, నారాయణపురం, బచ్చువారిగూడెం, గాడ్రాల, నెమలిపేట, నందిపాడు, కుడుములపాడు గ్రామాలను ఆనుకుని అడవిలో ప్రవహించే వాగుల నుంచి అక్రమంగా, తక్కువ ధరకు సేకరించిన ఇసుకను గోదావరి ఇసుక పేరుతో రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, అటవీ అధికారుల కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటే కారణాలు అర్థం చేసుకోవచ్చు.

పాల్వంచ ద్వారా హైదరాబాద్‌కు..

అశ్వారావుపేట, ములకలపల్లితో పాటు దమ్మపేట మండలం పట్వారిగూడెం అక్రమ ఇసుక రవాణా, ఎగుమతికి అడ్డాలుగా మారాయి. అశ్వారావుపేటలో బహిరంగంగానే అక్రమ దిగుమతి, ఎగుమతి జరుగుతుంటే పట్వారిగూడెం, ములకలపల్లి మండలంలో కాస్త రహస్యంగా సాగుతోంది. ములకలపల్లి మండలంలో ఇసుక వనరులు మెండుగా ఉండడంతో అక్కడి నుంచి పాల్వంచ ద్వారా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. అశ్వారావుపేటలో అంతర్రాష్ట్ర మాఫియా ఇసుక వ్యాపారం చేస్తోంది. ఏపీకి చెందిన కొందరు వ్యాపారులు ఇక్కడి బ్రోకర్ల అండదండలతో అక్కడి రీచ్‌ల నుంచి అశ్వారావుపేటకు ఇసుక తరలిస్తున్నారు. ఏపీలోని కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట రీచ్ నుంచి జీలుగుమిల్లి మండలానికి తరలిస్తున్నట్టుగా జీపీఎస్ నమోదుకు అశ్వారావుపేట – జీలుగుమిల్లి మధ్య గల సరిహద్దు చెక్‌పోస్టు వద్ద స్టాంపింగ్ చేయించుకుంటారు. కానీ ఇసుకను మాత్రం అనధికారికంగా అశ్వారావుపేటలో అన్‌లోడ్ చేస్తారు. ఇక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌కు ఎగుమతి చేస్తారు.



ఇటీవల పట్టుబడిన ఇసుక టిప్పర్లు

తాజా ఘటనతో బట్టబయలు..

అశ్వారావుపేట, జీలుగుమిల్లి మండలాల్లో రాత్రి వేళ వచ్చే అక్రమ ఇసుక లారీలు ఆపి అధికారులకు పట్టిస్తామంటూ బెదిరించి రూ.లక్షలు గడించేవారూ ఉన్నారు. అశ్వారావుపేట మీదుగా ఇసుక లారీని ఎవరి కంటా పడకుండా దాటిస్తే లారీకి రూ. వెయ్యి తీసుకునే నైట్ రైడర్స్ కూడా ఉన్నారు. తెలంగాణ ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇటీవల అశ్వారావుపేటలో ఒకరు ఇంటి నిర్మాణానికి బ్రోకర్ ద్వారా ఏపీకి చెందిన రెండు లారీల ఇసుక కొనుగోలు చేశారు. అయితే ఈ లారీలను ఏపీకి చెందిన కొందరు వెంబడించి అర్ధరాత్రి వేళ అటకాయించగా కొనుగోలు చేసిన వ్యక్తి తనదేనని చెప్పాడు. దీంతో వారు వెళ్లినట్టే వెళ్లి ఏలూరు అధికారులకు సమాచారం ఇవ్వడంతో కుక్కునూరు పోలీసులు లారీలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇసుకను కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయానికి తరలిస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు తెలిపారు. తెలంగాణ భూభాగంపై ఏపీ అధికారుల దాడులు చేయడమేంటనే చర్చ జరుగుతున్న సమయంలోనే ఏలూరు నుంచి ‘సాక్షి’లో ఇసుక మాఫియా తీరుతెన్నులపై కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. ఇసుక చోరీ జరిగింది కుక్కునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కాబట్టి చోరీ సొత్తును రికవరీ చేసి అక్కడి తహసీల్దార్‌కు అప్పగిస్తామని కుక్కునూరు సీఐ చెప్పారని వివరించారు.

5,767 ఎకరాల్లో పంట నష్టం

- 63 గ్రామాల్లో 2,008 మంది రైతులకు నష్టం
- జిల్లాలో అధిక వర్షపాతం నమోదు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో 5,767 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తేలింది. జిల్లాలోని 63 గ్రామాల్లో 2,008 మంది రైతులకు సంబంధించిన పటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ ప్రకటించింది. వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఆయిల్‌పామ్ పంటలకు నష్టం జరిగిందని సర్వేలో తేలినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన పంట నష్టం సర్వే వివరాలిలా ఉన్నాయి. అశ్వాపురం మండలంలో 340 మంది రైతులకు సంబంధించిన 1,150 ఎకరాలు, బూర్గంపాడు మండలంలో 708 మందికి సంబంధించిన 1,590 ఎకరాలు, మణుగూరు మండలంలో 352 మందికి సంబంధించిన 854 ఎకరాలు, జూలూరుపాడు మండలంలో 58 మంది రైతులకు సంబంధించి 368 ఎకరాలు, పాల్వంచ మండలంలో 414 మందికి సంబంధించిన 1,639 ఎకరాలు, చంద్రుగొండ మండలంలో ముగ్గురు రైతులకు సంబంధించి 5 ఎకరాలు, లక్ష్మీదేవిపల్లి మండలంలో 73 మందికి సంబంధించిన 106 ఎకరాలు, సుజాతనగర్ మండలంలో 60 మంది రైతులకు సంబంధించిన 55 ఎకరాల పంటలు దెబ్బతిన్నట్లు సర్వేలో తెలిసింది.


అశ్వాపురంలో ధ్వంసమైన పత్తి పంట

అధిక వర్షపాతం నమోదు

జిల్లాలో ఈ వర్షాకాలంలో జూన్ నుంచి ఇప్పటి వరకు భారీవర్షాల కారణంగా అధికవర్షపాతం నమోదైంది. అన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు 12,223 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 22,349.4 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. అత్యధికంగా చర్ల మండలంలో 1,623.6 మి.మీ, లక్ష్మీదేవిపల్లి మండలంలో మిగతా మండలాల కంటే తక్కువగా 622.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి 531.4 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 971.7 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం.

సర్వే కొనసాగుతోంది..



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైతాంగానికి జరిగిన పంటల నష్టం వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నాం. ప్రభుత్వం తరఫున అందాల్సిన పంట నష్టాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరైన వెంటనే అందజేస్తాం. ఇంకా జిల్లాలో పంట నష్టం వివరాలను సేకరిస్తున్నాం.

– వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

జాగిలం షైనీ సేవలు మరువలేనివి..

ఏఎస్పీ పరితోష్ పంకజ్


నివాళులర్పిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

కొత్తగూడెంరూరల్: పోలీస్‌శాఖలో డాగ్ స్క్వాడ్ విధుల్లో షైనీ సేవలు మరువలేనివని ఏఎస్పీ (ఆపరేషన్స్) పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మరణించిన పోలీసు జాగిలం షైనీ అంత్యక్రియలను పోలీసుల ఆధ్వర్యంలో చాతకొండ బెటాలియన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఏఎస్పీ మాట్లాడారు. పదేళ్లుగా డాగ్ స్క్వాడ్‌లో సేవలందిస్తున్న షైనీ బ్లడ్ కేన్సర్‌తో మృతిచెందిందన్నారు. షైనీ భౌతికకాయానికి పోలీసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, అడ్మిన్ ఆర్‌ఐ లాల్ బాబు, ఆర్‌ఐ ఆపరేషన్స్ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాడవాడలా సాయుధ పోరాట వారోత్సవాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగించిన నాటి కమ్యూనిస్టు పోరాట యోధులు, అమరులను స్మరించుకుంటూ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. కొత్తగూడెం నుంచి మంగళవారం ఆయన గూగుల్ మీట్ ద్వారా జిల్లా సమితి నాయకులతో సమావేశమయ్యారు. పోరాటంలో నేలకొరిగిన కమ్యూనిస్టులు, ఉద్యమకారుల త్యాగాలను నేటి తరానికి వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామగ్రామాన సభలు, సమావేశాలు, జెండా ఆవిష్కరణలు చేపట్టడమే కాక ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ విలీన దినోత్సవ సభకు తరలిరావాలని సాబీర్ పాషా కోరారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న కేవీ రంగాకిరణ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో బుధవారం జరగనున్న బీజేపీ సభ్యత్వ సన్నాహక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో రంగాకిరణ్ మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రానున్నారని, ఓల్డ్ డిపో నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పానిశెట్టి వెంకటేశ్వర్లు, తాటిపాముల ఐలయ్య, భైరి నిర్మలాదేవి, గొడుగు శ్రీధర్‌యాదవ్, భూక్య రమేశ్, రాజేశ్‌నాయక్, మాలోత్ గాంధీ, క్రాంతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పాల్వంచ: విద్యుత్ షాక్‌కు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 29న బీసీఎం రోడ్‌లో భవన నిర్మాణ పనులు జరుతుండగా కుంటినాగుల గూడెం గ్రామానికి చెందిన తురుసం ప్రియ కూలీ పనుల నిమిత్తం వచ్చింది. కాగా సాయంత్రం సామాన్లు సర్దుతుండగా ఇనుప రాడ్ మారుస్తున్న క్రమంలో పక్కనున్న విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురైంది. తీవ్రంగా గాయపడిన ప్రియను కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు ప్రియ సోదరుడు మిడియం నరేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

కారేపల్లిలో యువకుడి వీరంగం

కారేపల్లి: మద్యం మత్తో లేక గంజాయి మత్తులో ఉన్నాయో తెలియదు కానీ ఓ యువకుడు మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి మాదిరి మంగళవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో వీరంగం సృష్టించాడు. చొక్కా విప్పుకొని తిరుగుతూ కదిలే ఆటోలు, బైక్‌లు ఎక్కిదిగుతూ, వచ్చివెళ్లే జనాలను భయపెడుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. ఎందరు వారించినా ఆ యువకుడు వినకపోవడంతో కారేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అయితే, పోలీసులకు కూడా చిక్కకుండా పరుగులు పెట్టడంతో స్థానికుల సాయంతో ఆయనను ఆటోలో పోలీసుస్టేషన్‌కు తరలించారు. సదరు యువకుడి వివరాలు తెలియకపోగా, మైకంలో ఉండడంతో అలా ప్రవర్తిస్తుండగా కాసేపటికి పంపించామని పోలీసులు తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,392

ఆదివాసీ క్రీడాకారుడికి సహకరించండి..

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని మారుమూల గ్రామానికి చెందిన ఆదివాసీ క్రీడాకారుడు మోడెం వంశీ పవర్‌లిఫ్టింగ్‌లో అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నాడని, ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని భద్రాద్రి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీబాలా దేవికి విన్నవించారు. హైదరాబాద్‌లో ఆమెను కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. గత నెల మాల్టా దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని భారత్‌కు బంగారు పతకం సాధించాడని, వచ్చేనెల 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో తెలంగాణ తరఫున భారత్‌కు ఎంపికయ్యాడని, క్రీడాకారుడికి ఆర్థికంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జీవీ రామిరెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, మహంతి కృష్ణాజి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

హైదరాబాద్ ఆస్పత్రికి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్

ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన వంశీ

భద్రాచలంఅర్బన్ : కరకగూడెం మండల పరిధిలోని రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో ఈనెల 5న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు గాయపడగా, భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన వంశీ అనే కానిస్టేబుల్‌కు ఐదుగురు సభ్యులతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స నిర్వహించింది. ఈనెల 6న రాష్ట్ర గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ స్టీఫెన్ రవీంద్ర భద్రాచలం వచ్చి ఇద్దరు కానిస్టేబుళ్ల ఆరోగ్యంపై ఆరా తీశారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని ఎస్పీ రోహిత్‌రాజ్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో వంశీ త్వరగా కోలుకునేలా వైద్యుల సూచన మేరకు కొత్తగూడెం ఓఎస్డీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ తరలించారు. ఆయన వెంట కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.


వంశీని హెలికాప్టర్‌లో తరలిస్తున్న పోలీసులు

గోదావరిలో దూకిన కానిస్టేబుల్ మృతదేహం లభ్యం

- నాలుగు రోజుల క్రితం సెల్ఫీ తీసుకుని ఆత్మహత్య
- పాల్వంచలో అంత్యక్రియలు

భద్రాచలంఅర్బన్/పాల్వంచ : జిల్లా క్లూస్‌టీంలో పనిచేస్తున్న శీలం రమణారెడ్డి ఈ నెల 6వ తేదీన సెల్ఫీ తీసుకుని, గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకగా.. సోమవారం రాత్రి ఆయన మృతదేహం లభించింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక వద్ద గోదావరి ఒడ్డున సోమవారం సాయంత్రం అక్కడి జాలర్లు ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణానికి చెందిన గజ ఈతగాడు ప్రసాద్ సాయంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహం బాగా దెబ్బతినడంతో.. ఇటీవల కారు ప్రమాదానికి గురైన రమణారెడ్డి చేతికి కుట్లు వేయగా.. వాటి ఆధారంగా మృతదేహాన్ని గుర్తించి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు ముందు రమణారెడ్డి తాను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నానని, వీటిని తట్టుకుని జీవితాన్ని ముందుకు తీసుకుపోలేనని సెల్ఫీ వీడియోలో వివరించి గోదావరిలో దూకినట్లు తెలిసింది. కాగా, మృతదేహాన్ని పాల్వంచలోని పోలీస్ క్వార్టర్స్‌కు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ సుమన్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించాక హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య శ్రీలత, కుమారుడు ఉన్నారు.


రమణారెడ్డి(ఫైల్)

ఆరు రోజులైనా లభించని సాయికృష్ణ ఆచూకీ

పాల్వంచరూరల్: కిన్నెరసాని వాగులో గలంతై ఆరు రోజులు గడిచినా సాయికృష్ణ ఆచూకీ నేటికీ లభించలేదు. తిరిగి వస్తాడని సాయికృష్ణ కుటుంబ సభ్యులు ఆశతో ఎదురుచూస్తున్నారు. బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామానికి చెందిన జూరే సాయికృష్ణ మండలంలోని దంతలబోరు జీపీ గంగదేవిగుప్పలోని అత్తగారి ఇంటికి ఈ నెల3న భార్య మమత, పిల్లతో కలిసి వచ్చాడు. 5న తోడల్లుడు కుంజా భద్రం, అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి చేపల కోసం సొంపెల్లి సమీపంలోని కిన్నెరసాని, ముర్రేడు వాగు కలిసే దీవిలోకి వెళ్లారు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద ప్రవహం పెరగడంతో మొత్తం ఏడుగురు వరదలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు ఆదే రోజు రాత్రి ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి, బోట్ల సాయంతో రాత్రి 10 గంటల తర్వాత ఆరుగురిని రక్షించారు. జూరే సాయికృష్ణ మాత్రం గల్లంతయ్యాడు. మరుసటిరోజు కూడా డీడీఆర్‌ఎఫ్ బృందాలు గాలించినా ఆచూకీ దొరకలేదు. సాయికృష్ణ గలంతైనప్పటి నుంచి కిన్నెరసాని, ముర్రేడు వాగులో వరద ఉరకలెత్తుతోంది. ఎక్కడైనా చిక్కుకొని ఉంటే తిరిగి ఇంటికి వస్తాడని భార్య, ఇద్దరూ బిడ్డలతోపాటు కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


సాయికృష్ణ (ఫైల్)

అలా పెరిగింది..



గత జూలై 18వ తేదీన కురిసిన భారీ వర్షంతో పెదవాగు ఉప్పొంగి పంట పొలాలను ముంచెత్తిన సంగతి తెలిసిందే. దీంతో పలు గ్రామాల్లో పంటలు వరదపాలు కాగా, ఆ నాటి నుంచి పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు ఖాళీగా వదిలేశారు. కానీ, కొన్ని పొలాల్లో వరి గింజలు మొలకెత్తి అక్కడక్కడే ఏపుగా పెరుగుతున్నాయి. ఈ దృశ్యాన్ని మంగళవారం అశ్వారావుపేట మండలం నారాయణపురం సమీపంలో ఓ రైతు పొలంలో 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. – అశ్వారావుపేటరూరల్

కార్యదర్శి నిర్బంధంపై కేసు

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్యదర్శిని కార్యాలయంలో నిర్బంధించిన ఘటన మండలంలోని రాచూరుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాచూరిపల్లి గ్రామ పంచాయతీ పరిధి గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం విషయంలో అదే పంచాయతీ పరిధిలోని లచ్చాపురం గ్రామానికి చెందిన తాళ్ల సురేశ్.. పంచాయతీ కార్యదర్శి గంగుల రవిని అసభ్య పదజాలంతో దూషించాడు. అంతేగాక కార్యదర్శి విధులకు ఆటంకం కలిగిస్తూ అతడిని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశాడు. ఈ విషయంలో సురేశ్‌కు మరో వ్యక్తి సహకరించాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

దూషించిన వ్యక్తిపై..

కొత్తగూడెంటౌన్: ఇంట్లో అద్దెకుంటే వ్యక్తిని దుర్భాషలాడిన ఓ ఇంటి యజమానిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన కోటా శివశంకర్ ఇంట్లో భుర్రా వీరభద్రం నాలుగేళ్లుగా అద్దెకుంటున్నాడు. కొంత పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లు చెల్లించాలని శివశంకర్ బూతులు తిట్టాడని వీరభద్రం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని వన్‌టౌన్ పోలీసులు వెల్లడించారు.

దాడి ఘటనపై..

ములకలపల్లి: రుణం సకాలంలో చెల్లించలేందంటూ దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని చాపరాలపల్లి ఎస్సీకాలనీకి చెందిన నారపోగు రాధ మరికొందరు స్థానికులతో కలిసి ఓ ప్రైవేట్ సంస్థలో లోన్ (రుణం) తీసుకున్నారు. నెలానెలా వాయిదాలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల వాయిదాను రాధ ఆలస్యంగా చెల్లించింది. దీంతో ఆగ్రహానికి గురైన అదే గ్రామానికి చెందిన బొల్లెపోగు నర్సింహారావు, మాణిక్యం, సుశీల సోమవారం రాత్రి రాధ, ఆమె కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. విచక్షణా రహితంగా కొట్టారు. మంగళవారం రాధ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న కర్ర ట్రాక్టర్లు పట్టివేత

బూర్గంపాడు: ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న రెండు కర్ర ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. లక్ష్మీపురం గ్రామంలోని ఉడ్ యార్డుకు పరిమితికి మించి అధిక లోడుతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

పాల్వంచరూరల్: ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఓ మహిళ వద్ద నుంచి ముగ్గురు వ్యక్తులు రూ.2 లక్షల నగదును స్వాహా చేసి పరారైన ఘటన మంగళవారం వెలుగుచూసింది. మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీకి చెందిన కంచర్ల దుర్గ వద్ద కొత్తగూడెంనకు చెందిన సంజీవరాజు, చరణ్‌రాజు, మరో వ్యక్తి కలిసి విద్యాశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మపలికి గతేడాది సుమారు రూ.2 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని బాధితురాలు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి వద్ద ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో విచారణ జరుపుతున్నామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

పినపాక: వ్యక్తి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పినపాకలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పినపాకకు చెందిన కోడిరెక్కల స్వప్న(30).. అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడటంతో ఫోన్ నంబర్ ఇచ్చింది. దీంతో ప్రవీణ్ ఆమెకు ఫోన్ చేసి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 5న ఎవరూలేని సమయం చూసి ఆమె ఇంటికి వెళ్లి లైంగికదాడికి యత్నించగా ఆమె ప్రతిఘటించింది. ఆమె పిల్లలు ఇంటికొచ్చి చూసేసరికి అతడు పారిపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురైన స్వప్న పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మణుగూరు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి భర్త సోదరుడు కోడిరెక్కల నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రెండు కేజీల గంజాయి పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట బీసీఎం జాతీయ రహదారిపై రూరల్ ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన కారును తనిఖీ చేయగా రూ.50 వేల విలువ కలిగిన రెండు కేజీల గంజాయి లభించిందని, హైదరాబాద్‌కు చెందిన నిరంజన్, అఖిల్, సంత్‌ను అదుపులోకి తీసుకున్నామని, గంజాయిని భద్రాచలం నుంచి హైదరాబాద్ తరలిస్తూ పట్టుబడ్డారని ఎస్‌ఐ తెలిపారు. గంజాయిని చిన్నచిన్న పొట్లాలుగా మార్చి విక్రయిస్తుంటారని విచారణలో తేలిందని ఎస్‌ఐ వివరించారు.

నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్ల పరిశీలన

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వినాయక ప్రతిమలను భద్రాచలం వద్ద గోదావరిలో నిమజ్జనానికి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా నిమజ్జన ఘాట్‌లో ఏర్పాట్లను మంగళవారం కొత్తగూడెం ఓఎస్డీ పరితోష్ పంకజ్ పరిశీలించి మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యాన పోలీసులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి వరదల కారణంగా ఎవరైనా ఇబ్బంది పడితే డయల్ 100కు ఫోన్ చేసేలా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. కాగా, నిమజ్జనానికి వచ్చే భక్తులతో పోలీసులు స్నేహభావంతో మెలగాలే తప్ప దురుసుగా ప్రవర్తించొద్దని చెప్పారు. ఇక భద్రాచలంలో గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రజలెవరూ ఇటువైపు రావొద్దని సూచించారు. భద్రాచలం ట్రాఫిక్ ఎస్‌ఐలు మధుప్రసాద్, మూర్తి, గ్రామ పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, గోదావరి కరకట్ట పరిసరాల్లో చెత్తాచెదారాన్ని మంగళవారం నుంచి మూడు యంత్రాల సాయంతో గ్రామపంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. వినాయక నిమజ్జనం సమీపిస్తుండటంతో గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో చెత్తాచెదారం, మట్టి తొలగించి చదును చేయిస్తున్నారు.


నిమజ్జన ఘాట్ వద్ద సూచనలిస్తున్న ఓఎస్డీ పరితోష్ పంకజ్

తగ్గుతున్న తాలిపేరు

చర్ల: తాలిపేరుకు రెండు రోజుల పాటు వరద పోటెత్తగా సోమవారం తెల్లవారుజాము నుంచి తగ్గుముఖం పడుతోంది. ఆదివారం రాత్రి 12 గంటల వరకు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వస్తుండటంతో ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచి 1,65,878 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని విడుదల చేస్తున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి వరదనీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో నీటి విడుదలను క్రమేపీ తగ్గించారు. సోమవారం రాత్రి 8 గంటలకు 25 గేట్లను ఎత్తి 31,645 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని విడుదల చేస్తున్నారు. కాగా, గోదావరి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద పోటెత్తుతుండటంతో గోదావరి నీటిమట్టం గంట గంటకూ పెరుగుతోంది. ఈ క్రమంలో తేగడలోని తాలిపేరు లోలెవెల్ చప్టాపై సుమారు 15 అడుగుల మేర వరదనీరు చేరగా, చర్ల మండలంలోని కుదునూరు, దేవరాపల్లి గ్రామాల మధ్యలోని జోడిచీలి కలవాగుల్లో నుంచి బ్యాక్ వాటర్ వచ్చి వాగులకు ఇరువైపులా ఉన్న పంట చేలను ముంచెత్తుతోంది. కొత్తపల్లి, లింగాపురం, కుదునూరు, దేవరాపల్లి, గుంపెన్నగూడెం, దండుపేట, తేగడ గ్రామాల శివార్లలోకి చేరడంతో ఆయా గ్రామల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సుమారు 100 ఎకరాల్లోని వరి పంట నీటమునగగా గోదావరికి వరద ఉధృతి మరింతగా పెరిగితే మరి కొంత విస్తీర్ణంలోని పంటలు నీట మునిగే ప్రమాదం ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టు గేటు ఎత్తివేత

పాల్వంచరూరల్: 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల వరద రావడంతో మంగళవారం నీటిమట్టం 405.30 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తి 6 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

లారీలో మంటలు.. దగ్ధమైన క్యాబిన్

రఘునాథపాలెం: జిల్లా కేంద్రంలోని ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రోడ్డు శివాయిగూడెం పెంకుల ఫ్యాక్టరీ సమీపాన మంగళవారం ఎరువుల లోడ్‌తో వెళ్తున్న లారీ దగ్ధమైంది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాలు... ఖమ్మం నుండి డోర్నకల్ మండలం గొల్లచర్లకు యూరియా లోడ్‌తో వెళ్తుండగా శివాయిగూడెం సమీపాన లారీ క్యాబిన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు మొదలయ్యాయి. దీంతో మంటలు చెలరేగి క్యాబిన్ పూర్తిగా కాలిపోగా అప్రమత్తమైన డ్రైవర్ గణేష్ కిందకు దిగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. లారీ డోర్నకల్ మండలం గోలచర్ల గ్రామానికి యూరియా ఎరువుల లోడుతో వెళ్తుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


లారీ క్యాబిన్‌లో చెలరేగుతున్న మంటలు

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఒకరికి ఇరవై, ఇంకొకరికి పదేళ్ల కారాగారం

ఖమ్మం లీగల్: కామేపల్లి మండలం కొత్త లింగాలకు చెందిన బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... బాలిక ఆటోలో వెళ్తుండగా కొత్తలింగాలకు చెందిన పండగ నాగేంద్రబాబు, పండగ రాంబాబు ఆమెను అడ్డగించడమే కాక బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఘటనపై 2019 నవంబర్ 8న బాలిక తండ్రి కామేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణలో నేరం రుజువు కావడంతో నాగేంద్రబాబుకు 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.50 వేలు జరిమానా, రాంబాబుకు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా, కె.మోహన్‌రావు, చిట్టిబాబు సహకరించారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామ తుమ్మలమ్మ చెరువులో గల్లంతైన పిల్లి వీరయ్య(58) మృతదేహం మంగళవారం లభ్యమైంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం నందగిరికి చెందిన ఆయన జగన్నాథపురంలోని కుమార్తె వద్ద ఉంటూ ఆదివారం చెరువులో చేపల పట్టేందుకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆదివారం నుంచి గాలిస్తుండగా మంగళవారం వీరయ్య మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై వీరయ్య భార్య పద్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.


వీరయ్య మృతదేహాన్ని తీసుకొస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది